# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 240 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 24 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 23:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి మిగతా2లో...

# 2027 నాటికి హంద్రీనీవా పనులు పూర్తి చేయాలి

**● హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2 పనులను వేగవంతం చేయాలి.. ● అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 23:** హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. 2027 నాటికి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సీఎం అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులపై సమీక్షించారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని పనుల పురోగతిపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2లో మిగిలిన పనులకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని సూచించారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, పనులను 2027 నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాయచోటి నియోజకవర్గ పరిధిలో హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు సంబంధించి 490 నుంచి 535 మిగతా2లో...

# టెక్కలి సమీపంలో ఘోర రైలు ప్రమాదం

**రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల మృతి.. మరో విద్యార్థికి గాయాలు**



**శ్రీకాకుళం,మన జనప్రగతి సెప్టెంబర్ 23:** శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో మంగళవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా టెక్కలిలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థులుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమా దంలో విశాఖరావు, దిలీప్‌కుమార్, శరత్‌కు మార్, శివ మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ట్రాక్ దాటే సమయంలో రైలు రాకను గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రైల్వే భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.నలుగురు విద్యార్థులు మిగతా2లో...



# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

**ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్**

**ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 23:** బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు మిగతా2లో...

# భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

**రూ.22,177 కోట్ల పెట్టుబడులు.. 19,739 ఉద్యోగాలకు అవకాశం**



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 23:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో మొత్తం రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు, 19,739 ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.పరిశ్రమలు, ఇంధనం, ఆహార శుద్ధి, ఐటీఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మై హోమ్ ఇండస్ట్రీస్, క్యాటర్‌పిల్లర్, హీూఖీ క్లోతింగ్, దాల్మియా సిమెంట్, అగర్వాల్ ఫౌండ్రీస్, LG ఎలక్ట్రానిక్స్ తదితర సంస్థలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.అమరావతి రాజధాని పరిధిలో మిగతా2లో...

# అమరావతిలో ప్రపంచస్థాయి నేత్ర వైద్య కేంద్రం

**- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు భూమిపూజ చేసిన సీఎం చంద్రబాబు**



**అమరావతి:మన జనప్రగతి సెప్టెంబర్ 23:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమరావతి రాజధానిలో మరో ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థకు శ్రీకారం చుట్టారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ నూతన ప్రాంగణం నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మిగతా2లో...

# అగ్రిగోల్డ్ బాధితులకు తొలి విడతలోనే న్యాయం

**- పూర్తి డబ్బు చెల్లించి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యం బాండ్ల సేకరణకు 20 ప్రత్యేక బృందాలు**



**అమరావతి:మన జనప్రగతి సెప్టెంబర్ 23:** అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, అగ్రిగోల్డ్‌పై ప్రభుత్వం నియమించిన మంత్రుల సబ్‌కమిటీ సభ్యుడు నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం సచివాలయంలో అగ్రిగోల్డ్‌పై స్టేట్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి బాండ్లు కలిగి ఉన్న బాధితులు తమ ఒరిజినల్ బాండ్లను చూపించి, జిరాక్స్ కాపీలను మిగతా2లో...

# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ**



2లో



# విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు అవగాహన కార్యక్రమాలు

**- మంత్రి నారా లోకేశ్**

**అమరావతి:మన జనప్రగతి సెప్టెంబర్ 23:** విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మిగతా2లో...

# 2027 నాటికి హంద్రీనీవా పనులు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)
కిలోమీటర్ల వరకు సుమారు రూ.350 కోట్ల విలువైన పనులను సమగ్రంగా చేపట్టాలని సీఎం సూచించారు. **25 వేల ఎకరాల చెరువులకు నీరు** హెచ్ఎన్ఎస్ఎస్ పనులు పూర్తయితే తాగునీరు, సాగునీటి అవసరాలు తీరడంతో పాటు సుమారు 25 వేల ఎకరాల పరిధిలోని ఖాళీ చెరువులను నింపే అవకాశం ఉంటుందని మంత్రి మండిపల్లి తెలిపారు. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌తో అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలని ఆయన సూచించారు. హెచ్ఎన్ఎస్ఎస్ పనులకు ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. **స్థానిక ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం** రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నందున రైతులను పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.
మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అక్టోబర్ 2న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జి మంత్రులు అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, మూడు పార్టీల మధ్య సమన్వయం, ఐక్యత ఉండాలని సూచించారు. తొలిదశలో మున్సిపాలిటీలు, రెండో దశలో జెడ్పీటీసీ, మూడో దశలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే విధంగా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఇదే సందర్భంగా రాజకీయ ఉద్రిక్తతలు, శాంతిభద్రతల అంశాలపై సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం, శాప్ కార్యాలయంపై జరిగిన దాడుల వెనుక ఒకే వర్గం ఉందని ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్ బెంగళూరులో ఉండి రౌడీషీటర్లు, నేరస్థులను పంపి నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు విమర్శించా రు. రాజకీయ పార్టీల ముసుగులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను సహించబోమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి నుంచి పరిహారం వసూలు చేసే విధంగా చట్టాన్ని రూపొందించాలని డీజీపీని సీఎం ఆదేశించారు.

# టెక్కలి సమీపంలో ఘోర రైలు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)
ఒకేసారి మృతి చెందడంతో టెక్కలి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. **మరో విద్యార్థికి గాయాలు** ఈ ఘటనలో సాల్మన్‌రాజ్ అనే మరో విద్యార్థి గాయపడినట్లు అధికారులు తెలిపారు. అతడిని టెక్కలి డీహెచ్‌లో చికిత్సకు తరలించారు. **బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు** టెక్కలి సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖరావు, దిలీప్‌కుమార్, శివ, శరత్‌కుమార్ మృతి అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం.. రైలు రాకను గమనించకపోవడంతో ప్రమాదం జరిగిన ట్లు అధికారులు వివరించారు. గాయపడిన సాల్మన్ రాజ్‌కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అం డగానిలవాలని చంద్రబాబు అధికారులకు సూచించారు.

# అమరావతిలో ప్రపంచస్థాయి నేత్ర వైద్య కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)
అమరావతి అభివృద్ధి, వైద్యరంగం, పరిశోధన, సాంకేతిక రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. 12 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఈ సంస్థ ద్వారా ఏటా సుమారు 3 లక్షల మందికి నేత్ర వైద్య సేవలు అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు సీఎం తెలిపారు. కంటి చికిత్సలకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధన, శిక్షణ, విద్యా కార్యక్రమాలకు కూడా ఈ కేంద్రాన్ని వేదికగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అమరావతిలో ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ప్రపంచస్థాయి నేత్ర వైద్య పరిశోధనా కేంద్రంగా ఎదగాలని కోరారు. **3 కోట్ల కంటి చికిత్సలు** ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఇప్పటివరకు దాదాపు 3 కోట్ల కంటి చికిత్సలు అందించిందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లోని 319 కేంద్రాల ద్వారా పేదలకు నేత్ర వైద్య సేవలు అందిస్తున్న సంస్థ అమరావతి కేంద్రం ద్వారా సేవలను మరింత విస్తరించనుందని తెలిపారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు సకాలంలో చికిత్స అందించే విధంగా సంస్థ పనిచేస్తోందని చెప్పారు. **హెల్త్‌కేర్ హబ్‌గా అమరావతి** అమరావతిని నాలెడ్జ్ ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌తో పాటు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు అమరావతి హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.




విద్యా రంగంలోనూ పలు ప్రముఖ సంస్థలు అమరావతికి వస్తున్నాయని తెలిపారు. **ఐదు అంశాలతో రాజధాని నిర్మాణం** అమరావతిని నో-పొల్యూషన్ సిటీ, బ్లూ అండ్ గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ సిటీ, కార్బన్ న్యూట్రల్ సిటీ, డీప్‌టెక్ క్యాపిటల్గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం చెప్పారు. కాలుష్యరహిత వాతావరణంతో పాటు హరిత ప్రాంతాలు, గ్రీన్ ఎనర్జీ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. **క్వాంటం కంప్యూటింగ్‌కు కేంద్రంగా అమరావతి** సాంకేతిక రంగంలోనూ అమరావతిని ముందంజలో నిలపడానికి చర్యలు చేపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేసే ప్రణాళికను ప్రస్తావించారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. అలాగే స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాల్లో క్లస్టర్లను అభివృద్ధి చేసి భవిష్యత్ సాంకేతిక పరిశ్రమలకు అమరావతిని కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. **రూ.50 వేల కోట్ల పనులు** అమరావతిలో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని సీఎం తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రస్తావించారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను సీఎం మరోసారి గుర్తుచేసుకున్నారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అమరావతి భవిష్యత్తులో ఆరోగ్యం, పరిశోధన, విద్య, నాలెడ్జ్ ఎకానమీతో పాటు ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బ్యాంకింగ్ స్ట్రీట్ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని తెలిపారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు తొలి విడతలోనే న్యాయం

(మొదటి పేజీ తరువాయి)
ప్రత్యేక బృందాలకు అందించాలని మంత్రి సూచించారు. బాండ్ల సేకరణ కోసం మొత్తం 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 7, తెలంగాణలో 3, ఇతర రాష్ట్రాల్లో 10 బృందాలు రెండు, మూడు రోజుల్లో క్షేత్రస్థాయిలో పనిచేయనున్నాయని వెల్లడించారు. అగ్రిగోల్డ్ గతంలో సేకరించిన భూముల్లో చేపట్టిన ప్లాంటేషన్‌పై అటవీశాఖ ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి ఆడిట్ నిర్వహించనుందని చెప్పారు. అక్కడి వృక్ష సంపద విలువను కూడా అంచనా వేయనున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ పరిధిలో అగ్రిగోల్డ్ వేసిన లేఅవుట్ల పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారని వివరించారు. **35,544 మంది బోనాఫైడ్ లబ్ధిదారులు** అగ్రిగోల్డ్ ప్లాట్లు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న బోనాఫైడ్ లబ్ధిదారులకు తొలి దశలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ భూములు 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్నందున, వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చేసేందుకు త్వరలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 42,531 మంది ప్లాట్ లబ్ధిదారుల్లో 35,544 మందిని బోనాఫైడ్ లబ్ధిదారులుగా గుర్తించినట్లు వెల్లడించారు. మరో 6,989 మంది పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించినప్పటికీ రిజిస్ట్రేషన్లు జరగలేదని, వారికి రెండో విడతలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రిగోల్డ్ అంశంపై ఇకపై సబ్‌కమిటీ సమావేశాలను వేగవంతం చేసి, సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను త్వరగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని నాదెండ్ల మనోహర్ తెలిపారు. అగ్రిగోల్డ్ కారణంగా నష్టపోయిన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు సీసీఎల్ఏ, పోలీస్, మున్సిపల్ పాల్గొన్నారు.

# ఏపీలో డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ఆదేశాలివ్వాలని గవర్నర్‌కు వైసీపీ ఫిర్యాదు



**అమరావతి:మన జనప్రగతి సెప్టెంబర్ 23:** ఏపీలో జరిగిన డీఎస్సీ-2025 ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐచే విచారణ జరిపించాలని కోరారు. అదేశిదంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( శాప్) కార్యాలయం వద్ద వైసీపీ నాయకులపై దాడి గురించి కూడా ఫిర్యాదు చేశారు. అంతకు ముందు గ్రేటర్ విశాఖపట్నం నాయకులతో తాడేపల్లిలోని పార్టీకార్యాలయంలో సమావేశమయ్యారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాలకు చేస్తున్న మోసాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. వైసీపీ హయాంలో ప్రజలకు జరిగిన మేలును గుర్తు చేయాలని సూచించారు. విశాఖ తాగునీటి సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అదేవిధంగా విశాఖలో తన కుటుంబ సభ్యులకు అప్పనంగా అప్పగిస్తున్న ప్రభుత్వ భూములపై అలుపెరగని పోరాటం చేయాలని హితబోధ చేశారు. కూటమి పాలనలో జరుగుతున్న అవినీతి ఏ స్థాయికి వెళ్లిందో చెప్పడానికి డీఎస్సీ వ్యవహారమే ఒక నిదర్శనమని పేర్కొన్నారు. అన్యాయానికి పాల్పడుతున్న పోలీసుల వివరాలను డిజిటల్ డైరీలో నమోదు చేయాలని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ డైరీని ఓపెన్ చేస్తామని అన్నారు. టోపీపై ఉండే సింహాలకు మాత్రే తలవంచాలని, చంద్రబాబుకు కాదని పోలీసులకు సూచించారు.

# ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)
రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. **ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు. **పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. "పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు" అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు. **కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. "జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు" అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)
చేపట్టినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో-ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో-ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు. **ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో-ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో-ఇన్‌చార్జిగా నియమించారు. **సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# భారీ పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)
మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,548.98 కోట్లు, శాసనసభ భవన నిర్మాణానికి రూ.661 కోట్లు మంజూరు చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.125.65 కోట్ల సవరించిన పరిపాలనా అనుమతికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2.73%, 1.82% చొప్పున రెండు విడతల డీఏ/డీఆర్ మంజూరుకు ఆమోదం తెలిపింది. దీని వల్ల ప్రభుత్వంపై సుమారు రూ.4,556 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఉద్యోగులకు సెప్టెంబర్ 2026 జీతం నుంచి నగదు ప్రయోజనం అందనుంది. అమరావతిలోని ల్యాండ్ పూలింగ్ రైతులకు వార్షిక భృతి, వివిధ జిల్లాల్లో పారిశ్రామిక పార్కులు, సోలార్‌విండ్ ప్రాజెక్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, విద్యాపర్యాటక మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.


# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**న్యూయార్క్:మన జనప్రగతి సెప్టెంబర్ 23:** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం' అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు. 'వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది' అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

# విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు అవగాహన కార్యక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)
ఈ మేరకు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఈ ఏడాది 'మిషన్ మార్చ్' విధానంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 963 పాఠశాలల్లో విద్యార్థులకు యోగా శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గడంతో పాటు భయం, ఆందోళనను అధిగమించేందుకు సహాయపడుతుందని మంత్రి తెలిపారు. యోగా ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

# తుఫానుపై ఆర్టీజీఎస్ అప్రమత్తం



**అమరావతి:మన జనప్రగతి సెప్టెంబర్ 23:** ఉత్తరాంధ్రపై తుఫాను ప్రభావం నేపథ్యంలో ఆర్టీజీఎస్ పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి తుఫాను కదలికలు, వాతావరణ పరిస్థితులను రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తూ ప్రభావిత జిల్లాల అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అవేర్ యాప్, వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు తుఫాను కదలికలు, వర్షాలపై హెచ్చరికలు అందిస్తున్నారు. అవేర్ వెబ్‌సైట్-ల ద్వారా ప్రజలు తమ ప్రాంత వాతావరణ పరిస్థితులను రియల్‌టైమ్‌లో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# పుల్లంపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి:సిపిఐ



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సిపిఐ పుల్లంపేట మండల కార్యదర్శి రాజ బోయిన సల్వన్ కుమార్ ఆధ్వర్యంలో పుల్లంపేట మండల ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో ఇప్పటికే రైతులకు సాగునీరు లేక. ప్రజలకు త్రాగునీరు లేక గత ఐదు సంవత్సరాల నుండి వర్షాలు లేకపోవడంతో అటు రైతులు. ఇటు ప్రజలకు నీళ్లు తక్కువ రావడంతో శాస్త్రవేత్తలు చెప్పినట్లు ఇప్పుడు వర్షాల పూర్తిగా రాకుండా ఉండడంతో ప్రజలు అష్ట కష్టాలు పడుతూ దిక్కు తోసని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. వర్షాభావ పరిస్థితులపై శాస్త్రవేత్తలు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఇప్పుడు ఐదు సంవత్సరముల నుండి వర్షాలు లేక భూగర్భ జలాల ఇంకిపోవడంతో రైతులు పంటలకు సాగునీరు. తాగునీరు తక్కువ రావడంతో ప్రజలు, రైతులు లబోదిబో అంటూ ఉన్నారని అన్నారు. మండలంలో కొన్ని పంచాయతీల్లో త్రాగునీరు సరఫరా లేక పేద ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారుల సమస్యలను ప్రభుత్వానికి తెలిపి రైతులను, పేద ప్రజలను ఆదుకోవాలని జ్యోతి చిన్నయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు చింతలపూరి నాగమ్మ, చిన్న రామయ్య పాల్గొన్నారు

# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తత అవసరం

- పులివెందులలో పరిశుభ్రతే లక్ష్యం
- మున్సిపల్ పనులకు ప్రజలు సహకరించాలి
- పులివెందుల మున్సిపల్ కమిషనర్ శివ తనూజ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:** వర్షాకాలంలో పారిశుద్ధ్య లోపాలు,మురుగు నీటి నిల్వల కారణంగా వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాల పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పలు సూచనలు చేశారు.వర్షం పడే సమయంలో ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలు,శిథిలావస్థలో ఉన్న బలహీన భవనాల వద్ద ఉండరాదని ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాలన్నారు.వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే తాగునీటిని బాగా మరిగించి,చల్లారిన తర్వాతే తాగాలని సురక్షితమైన నీటినే నిత్యం వినియోగించాలన్నారు.చేతులను తరచుగా సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని చెత్తాచెదారాన్ని మురుగు కాలువల్లో వేయకుండా,మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలన్నారు.పరిసరాల్లో ఎక్కడైనా పారిశుద్ధ్య సమస్యలు కనిపిస్తే వెంటనే సమీప వార్డు సచివాలయంలో లేదా మున్సిపల్ కార్యాలయంలో సమాచారం అందించాలని పట్టణాన్ని రోగాల బారిన పడకుండా కాపాడుకోవడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణ,ఫాగింగ్ తదితర కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించి పులివెందులను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దాలని కమిషనర్ కోరారు.

# జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం



**పతికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–రేపు (శుక్రవారం) జరుగు జాతీయ నులి పురుగుల (ఎన్.డి.డి) ఘనంగా నిర్వహించి ప్రతి చిన్నారికి మందులను అందించేందుకు కృషి చేయాలని పత్తికొండ ఎంపీడీవో కవిత రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కవిత రెడ్డి ఆధ్వర్యంలో ఒక టాస్కోఫ్ర్ట్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.మండలంలోని అన్ని స్కూల్స్, అంగన్వాడి సెంటర్స్ లలో టాబ్లెట్ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ కార్యక్రమం, మరియు ప్రోగ్రాం విజంతం కావడానికి ఏర్పాట్లు గురించి వైద్య సిబ్బంది వైద్యాధికారులు ఎంపీడీవో తో చర్చించారు. ఈ సందర్భంగా పోస్టర్ను ఆవిష్కరించారు.

# బధిరులకు సంకేత బాషా ఎంతో అమూల్యమైనది

**ఎమ్మిగనూరు మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–సాధారణ మానవులు వినియోగించే భాష కంటే, బధిరులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సాంకేత భాష వారికి ఎంతో అమూల్యమైనదని, ఆ భాషతోనే వారు ముందుకు రాణిస్తారని ఎమ్మిగనూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రసీదుల్లా అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో భవిత పాఠశాలలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ సాంకేత భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బదిరులకు సంకేత భాష యొక్క ఆవశ్యకత గురించి తెలియజేశారు. లకు ఏమైనా సమస్యలు ఉంటే వారు న్యాయ సేవాధికార సంస్థలు సంప్రదిస్తే వారికి ఉచిత న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున, పానల్ అడ్వకేట్ లింగమూర్తి, లోకాదాలత్ క్లర్క్ రమాదేవి, భవిత పాఠశాల కరస్పాండెంట్ బాబు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం

- న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహణ







**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–బధిరులకు సంకేత భాష ఎంతో విలువైనదని, వారి హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆరో అదనపు జిల్లా జడ్జి, ఫుల్ అడిషనల్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.వాసు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి లీల వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ అన్నారు.బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నల్సా 'పిల్లల కోసం పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవల పథకం–2024'పై న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు, అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని నిర్వహించారు.జడ్జి వాసు మాట్లాడుతూ ప్రపంచ బధిర సమాఖ్య స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. నల్సా పథకం ద్వారా 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచితంగా, సురక్షితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. 1098, 181, న్యాయ సహాయం 15100, దివ్యాంగుల హెల్ప్‌లైన్ 14456 తదితర సేవలపై అవగాహన కల్పించారు.లీల వెంకట శేషాద్రి మాట్లాడుతూ సంకేత భాషను సహజమైన, సంపూర్ణ ప్రామాణిక భాషగా గుర్తించి బధిరుల మానవ హక్కులను పరిరక్షించాలన్నారు. చట్టపరమైన సమస్యలుంటే లీగల్ సర్వీసెస్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. వెంకట హరినాథ్ శాశ్వత లోక్ అదాలత్ పనితీరు, ప్రజలకు అందించే సేవలను వివరించారు.జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ భవిత కేంద్రాల ద్వారా బధిరులకు విద్య అందిస్తున్నామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ పోక్సో చట్టంపై అవగాహన కల్పించగా, దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రెయిస్ ఫాతిమా బధిరుల సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకరాజ్, కార్మిక, సంక్షేమ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు, బధిరులు, బధిర విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు

'ఆపరేషన్ త్రిశూల్'ను జిల్లాలో ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌కార్డ్ సమావేశంలో మాదకద్రవ్యాల నియంత్రణ, గంజాయి సాగు, అక్రమ రవాణా నివారణపై సమీక్షించారు. అనంతరం మహిళా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే 'ఆపరేషన్ త్రిశూల్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ గంజాయి సాగు, వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో 'వజ్ర ప్రహార్' సోదాలు నిర్వహించాలని, సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మిరప తోటలో సుమారు 10 గంజాయి మొక్కలు గుర్తించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 300 డ్రగ్ టెస్టింగ్ కిట్లలో 114 మందికి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి డి–అడిక్షన్ కేంద్రాల్లో చికిత్స అందిస్తున్నామని తెలిపారు.డి–అడిక్షన్ కేంద్రంలో సిబ్బంది కొరతను పరిష్కరించి బాధితులకు నిరంతర పర్యవేక్షణ, కౌన్సెలింగ్, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాపై సమాచారాన్ని సంబంధిత అధికారులకు లేదా 1972 హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా మహిళా భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతపై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళలపై నేరాలు, గంజాయి సాగు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ ప్రాంతాల్లో మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శాంతి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డీఈవో సుధాకర్, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన్న, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ సెప్టెంబర్ 25 లోగా ముఖ్యమైన బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తి చేసుకోవాలి

**28, 29, 30 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు**

**కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.మోహన్**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యు ఎఫ్ బి యు) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29 మరియు 30 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో,కర్నూలు జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.మోహన్ తెలిపారు.బుధవారం అయినా ఈ సందర్భంగా ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు.ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించేందుకు సెప్టెంబర్ 27, 2026 ఆదివారం నాడు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు మరియు రీజినల్ రూరల్ బ్యాంకులు సాధారణ పనివేళల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా సెప్టెంబర్ 27న బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం–లింక్ శాఖలు మరియు కరెన్సీ చెస్టు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు అనుమతి ఇచ్చిందన్నారు.అందువల్ల, సెప్టెంబర్ 26 నాల్గవ శనివారం సెలవు కాగా, సెప్టెంబర్ 27 ఆదివారం బ్యాంకులు సాధారణంగా పనిచేస్తాయని, అనంతరం సెప్టెంబర్ 28, 29 మరియు 30 తేదీలలో ప్రతిపాదిత బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో శాఖల ప్రత్యక్ష కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, ప్రజలకు అవసరమైన ముఖ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా బ్యాంకులు తగిన ఎస్ ఎల్ బి సి మార్గదర్శకాలు, మరియు బిసిపి అమలు చేయాలని సూచించారు.కర్నూలు జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు సాధ్యమైనంత వరకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ఖాతాదారులకు అవసరమైన సహకారం అందించాలని పి. మోహన్ కోరారు.

# నల్లా తిప్పితే మురుగునీరు.. రోగాల బారిన నగిరిగుట్ట వాసులు!

**ఐదారు నెలలుగా మురుగునీరే గతి..**

**అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం**

**మున్సిపల్ కమిషనర్‌ను కలవనివ్వకుండా సిబ్బంది నిర్లక్ష్యం**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:** వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పట్టణంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. పట్టణంలోని నగిరిగుట్ట ఎస్సీ కాలనీలో తాగునీటి కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆవేదన,ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజ్ పైప్‌లైన్లతో పాటు తాగునీటి పైప్‌లైన్లు పక్కపక్కనే ఉండటం,కొన్నిచోట్ల లైన్లు పగిలిపోవడంతో డ్రైనేజ్ నీరు తాగునీటి పైపుల్లో కలిసి సరఫరా అవుతోందని కాలనీవాసులు వాపోతున్నారు.గత ఐదారు నెలలుగా ఈ ప్రాంతంలోని సుమారు 150 ఇళ్లకు దుర్వాసనతో కూడిన మురుగునీరే సరఫరా అవుతోంది.ఈ కలుషిత నీటిని వాడటం వల్ల కాలనీవాసులు,చిన్నారులు చర్మవ్యాధులు (రాషెస్), అనారోగ్యాల బారిన పడుతున్నారు.తాగునీటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అదే నీటిని ఉపయోగించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.ఈ సమస్యపై మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఎవరూ స్పందించడం లేదని స్థానికుడు సాయికుమార్ తెలిపారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేద్దామంటే,కార్యాలయ సిబ్బంది మీటింగ్‌లో ఉన్నారంటూ, ఇతర కారణాలు చెబుతూ కలవనివ్వకుండా వెనక్కి పంపుతున్నారని మండి పడ్డారు. పైపులైన్లను,మ్యాన్‌హోల్స్‌ను తనిఖీ చేసి వెళ్తున్నారే తప్ప శాశ్వత మరమ్మతులు చేపట్టడం లేదని ఆరోపించారు.పగిలిపోయిన పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి,స్వచ్ఛమైన తాగునీటిని అందిం చాలని ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు



# కార్యకర్తలే పార్టీకి బలం.. ప్రజల్లోకి బలంగా వెళ్లాలి

**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 23:**రాయచోటి పట్టణం 31వ వార్డులో వైఎస్సార్‌సీపీ వివిధ హోదాలు పొందిన వారికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పదవి అనేది గుర్తింపు కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు లభించిన బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రతి కుటుంబంతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకుని, వారికి అండగా నిలవాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పనిచేస్తే పార్టీ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

# జెడ్పీటీసీ,ఎంపీపీ,ఎంపీటీసీలకు ఘన సన్మానం



**రైల్వేకోడూరు మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–రైల్వే కోడూరు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం పూర్తయిన సందర్భంగా రైల్వేకోడూరు మండల అభివృద్ధి కార్యాలయం (ఎంపీడీవో)లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. పదవీకాలం ముగిసినా ప్రజా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీకాలం పూర్తిచేసుకున్న ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఏపీ పర్యాటక శాఖ మాజీ డైరెక్టర్ మందల నాగేంద్ర, టౌన్ కన్వీనర్ సి.హెచ్. రమేష్, ఎన్. హరికృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎం. రాజేశ్వరమ్మ, ఎం. శివయ్య, రామకృష్ణయ్య, ఒబుల్రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పొలాల మార్గంలో సమాధులు..రైతులకు ఇబ్బందులు

**స్మశానవాటికకు కాంపౌండ్ వాల్**

**రైతుల పొలాలకు సీసీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 23:**–భాకరాపేట గ్రామ పరిధిలోని స్మశానవాటిక గుండా వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గంలో సమాధులు నిర్మించడం, మృతదేహాలను ఖననం చేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాలకు వెళ్లేందుకు ఉన్న కొద్దిపాటి దారి కూడా క్రమంగా ఆక్రమణకు గురవుతోందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మశానవాటిక పరిధిలోనే కాకుండా పొలాలకు వెళ్లే మార్గం వైపు కూడా సమాధులు నిర్మిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించి స్మశానవాటికకు కాంపౌండ్ వాల్ నిర్మించి, రైతులు పొలాలకు వెళ్ళేందుకు సీసీ రోడ్డు ఏర్పాటు చేసి రాకపోకలకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

# విద్యుత్ కేబుల్ దొంగతనాల ముఠా అరెస్ట్

- ఐదుగురు నిందితులతో పాటు ఒక బాలుడు అదుపులో
- రూ.5.40 లక్షల నగదు, కేబుల్ వైర్లు,వాహనాలు స్వాధీనం..!






**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–ప్రొద్దుటూరు పట్టణం,పరిసర ప్రాంతాల్లో విద్యుత్ కేబుల్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ వైర్లను దొంగతనం చేస్తున్న ముఠాను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చట్టంతో సంఘర్షణలో ఉన్న ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పరిధిలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు చెందిన కేబుల్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో ఉపయోగించే కాపర్ వైర్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిందితుల కదలికలపై నిఘా పెట్టి దర్యాప్తు చేపట్టగా ముఠా సభ్యులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన నిందితుల్లో ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన వెంకటేశ్వర్లు (37), కృష్ణయ్య (41), రంగనాయకులు (25), రామాపురానికి చెందిన మహేష్ (38), చాపాడుకు చెందిన శివకిరణ్ (26) ఉన్నారు.వీరితో పాటు 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.స్వాధీనం చేసుకున్న సొత్తులో రూ.5,40,000 నగదు, సుమారు 56 కిలోల సర్వీస్ వైర్ (అల్యూమినియం/కాపర్ వైర్),ట్రాన్స్‌ఫార్మర్లలో ఉపయోగించే సుమారు 5 కిలోల కాపర్ వైర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.అలాగే బజాజ్ మూడు చక్రాల ఆటో తో పాటు మరో 5 మోటార్ సైకిళ్ళు, రెండు ఇనుప కట్టర్లు, ఇనుప గడ్డలి, సుత్తి, నిప్పుసెన/కటింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దొంగతనాలకు పాల్పడిన నిందితులపై కేసులు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో నమోదైన విద్యుత్ వైర్ల దొంగతనం కేసుల్లోనూ వీరి ప్రమేయంపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏ ఎస్.పి యు.విభూకృష్ణ,ప్రొద్దుటూరు తాలూకా సిఐ ఎం.నాగభూషణం, ఎస్సై కె.సి.రాజు తదితర పోలీసు అధికారులు దర్యాప్తు వివరాలను వెల్లడించారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి దొంగతనాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వెలుగు వీవోఏలకు న్యాయం చేయాలి

**- డీపీఎంకు వీవోఏల వినతి**



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 23**:–వెలుగు వీవోఏలకు న్యాయం చేయాలని కోరుతూ రామాపురం మండల వీవోఏలు శ్రీనిధి డీపీఎంను కోరారు. వీవోఏల వీవీ–ఆర్పీ శిక్షణ కార్యక్రమానికి శ్రీనిధి డీపీఎం, ఏపీఎం నిరంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీవోఏలు తమ సమస్యలను డీపీఎం దృష్టికి తీసుకెళ్లారు.వీవోఏలు మాట్లాడుతూ శ్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించడంతో పాటు వాటి రికవరీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు వివిధ రకాల పనులు, పలు యాప్‌లలో వివరాల నమోదు వంటి బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నామని చెప్పారు. ఇన్ని పనులు చేస్తున్నప్పటికీ తమను సీబీఓ సిబ్బందిగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ సేవలకు తగిన గుర్తింపు కల్పించి, వీవోఏల ఖాతాల్లోనే వేతనాలు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేయాలని డీపీఎంను కోరారు.వీవోఏల సమస్యలను పీడీ దృష్టికి తీసుకెళ్లి, సెర్ప్ సీఈఓ, సెర్ప్ మంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ శిక్షణలో సీసీలు, గ్రామ సంఘం ఓబీలు, ఎల్‌సీ, శ్రీనిధి మేనేజర్, వీవోఏలు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ గుర్తింపు కార్డు పార్టీ బాధ్యతకు ప్రతీక

**- రాయచోటి 29వ వార్డులో పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డులు అందజేసిన శ్రీకాంత్‌రెడ్డి**



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలు పొందిన నాయకులు, కార్యకర్తలకు అందజేస్తున్న పార్టీ గుర్తింపు కార్డులు వారి పార్టీ అనుబంధానికి మాత్రమే కాకుండా, వారికి అప్పగించిన బాధ్యతకు ప్రతీకగా నిలుస్తాయని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో వైఎస్సార్‌సీపీలో వివిధ హోదాలు పొందిన నాయకులు, కార్యకర్తలకు శ్రీకాంత్‌రెడ్డి పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ గుర్తింపు కార్డు చేతిలో ఉండటం గౌరవంతో పాటు ప్రజలు, పార్టీ పట్ల తమ బాధ్యతను గుర్తుచేసే అంశమన్నారు. ప్రతి కార్యకర్త తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ పార్టీ శ్రేణులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వార్డు స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయడంతో పాటు ప్రతి కుటుంబంతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకోవాలని కోరారు.ప్రజల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు అండగా నిలవడమే పదవులకు అసలైన అర్థమని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సాదక్ అలీ, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రియాజుర్ రెహమాన్, నాయకులు సయ్యద్ అమీర్ వలీ, అతికూర్ రెహమాన్, సమీవుల్లా, తారీక్, అలీ అక్బర్, పఠాన్, అఫ్జల్, ఫైజాన్, మొహీర్, సైఫ్, సాహిర్, సాజిద్, సమీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలి

- అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**–రాష్ట్రవ్యాప్తంగా వీఆర్ఏలు తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం గత వారం రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెకు మద్దతుగా ప్రొద్దుటూరులో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, న్యాయపరమైన డిమాండ్లను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.ప్రొద్దుటూరు తాలూకా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఆర్.మునయ్య, ఉపాధ్యక్షుడు మునయ్య, కార్యదర్శి రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాల మహానాడు చెన్నయ్య వర్గం జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, జిల్లా కార్యదర్శి కొత్తమాస్ రాబర్ట్, జిల్లా యువజన సంఘం నాయకుడు తీట్ల చిట్టిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోరగుడి కుమార్, తాలూకా అధ్యక్షుడు జేష్టాది మధు తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి నాయకులు, వీఆర్ఏలు ర్యాలీగా బయలుదేరారు.ర్యాలీ స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది.అనంతరం తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజును కలిసి వీఆర్ఏల సమస్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ వీఆర్ఏల సంఘం, మాల మహానాడు సంయుక్త ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి,వారి న్యాయపరమైన డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. వీఆర్ఏలు ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో క్షేత్రస్థాయిలో కీలకమైన సేవలు అందిస్తున్నప్పటికీ, తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సమ్మె చేపట్టాల్సి వచ్చిందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు.కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు, సభ్యులు, మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రేమాలయంలో అన్నదాన కార్యక్రమం

**- పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించాలి**



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 23**:–రామాపురం మండలం బండపల్లి టోల్ ప్లాజా సమీపంలోని ప్రేమాలయంలో రాచపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పలవల వెంకటరెడ్డి కుమారుడు పలవల సాయికుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వారికి అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వెంకటరెడ్డి, సాయికుమార్ రెడ్డి మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకల పేరుతో ఆర్భాటాలకు, అధిక ఖర్చులకు దూరంగా ఉంటూ ఇలాంటి ఆశ్రమాల్లో అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ఇతరులకు ఉపయోగపడే విధంగా నిర్వహించడం ద్వారా ఆనందంతో పాటు ఆత్మసంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

# మూడు సంవత్సరాలు దాటిన పూర్తికాని రెడ్డివారిపల్లి బ్రిడ్జి

- నిమ్మకు నీరెత్తినట్లుగా కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు
- ఏరు దాటేందుకు సుమారు 12 గ్రామాల ప్రజల అవస్థలు
- రైతులకు తీవ్ర ఇబ్బందులు



**రైల్వేకోడూరు మన జనప్రగతి సెప్టెంబర్ 23**: –రైల్వేకోడూరురెడ్డివారిపల్లి మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు ప్రారంభమై మూడు సంవత్సరాలు దాటిన ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి పనులు మధ్యంతరంగా నిలిచిపోవడంతో రైల్వేకోడూరు నుంచి రెడ్డివారిపల్లి వైపు వెళ్లే సుమారు 12 గ్రామాల ప్రజలకు రాకపోకలు నరకప్రాయంగా మారాయి.బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ప్రస్తుతం ఏరు దాటుకుంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల్లోనే రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండగా,వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఏరు మార్గంలో బురద, బురదమయమైన మట్టి ఏర్పడి వాహనాలు అదుపుతప్పి జారిపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ మార్గం పరిధిలోని గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.ముఖ్యంగా బొప్పాయి, అరటి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు,పంటలను మార్కెట్‌కు తరలించేందుకు ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో పంటలను వాహనాల్లో తరలించేటప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల సమయంలో వాహనాలు ముందుకు కదలకపోవడంతో పంటలు ఆలస్యంగా మార్కెట్‌కు చేరే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర సమయాల్లో మరింత ప్రమాదం గా మారింది.బ్రిడ్జి లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, వ్యాపారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించే సమయంలో కూడా ఈ మార్గం సమస్యగా మారుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.వర్షాకాలంలో ఏరు ప్రవాహం పెరిగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇలా మూడుసార్లు జరిగిందని వాపోయారు.బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై సుమారు మూడు సంవత్సరాలు గడిచినా పనులు పూర్తి కాకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం లభించడం లేదని గ్రామస్తులు అంటున్నారు.“ఇంకెన్నాళ్లు ఈ అవస్థలు పడాలి?” అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.వెంటనే పనులు పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.వర్షాకాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఈ ప్రాంతాన్ని తక్షణమే పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణ పనులు ఎందుకు నిలిచిపోయాయో సమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులకు అవసరమైన నిధులు,సాంకేతిక అనుమతులు,కాంట్రాక్టర్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
24 - 09 - 2026

## హానికర వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**● ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి**





**కడప,మన జనప్రగతి సెప్టెంబర్ 23 :-** హానికర వ్యర్థాల నిర్వహణ, రవాణా, ప్రీ-ప్రాసెసింగ్, సహ-ప్రాసెసింగ్ ప్రక్రియల్లో పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ సంస్థ (ఏపీఈఎంసీఎల్) చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. బుధవారం వైఎస్ఆర్ కడప జిల్లాలోని భారతి సిమెంట్స్ పరిశ్రమతో పాటు ముద్దనూరు మండలంలోని జీఎం ఎకో సర్వీసెస్ ఎల్ఎల్పీ పరిశ్రమలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హానికర వ్యర్థాల నిర్వహణ, ప్రీ-ప్రాసెసింగ్, సహ-ప్రాసెసింగ్ ప్రక్రియలను పరిశీలించారు.భారతి సిమెంట్స్‌లోని హానికర వ్యర్థాల సహ-ప్రాసెసింగ్ విభాగాన్ని పరిశీలించిన చైర్మన్, వ్యర్థాలను నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు, వ్యర్థాల నిర్వహణ విధానాలను పరిశీలించారు.అనంతరం ముద్దనూరు మండలంలోని జీఎం ఎకో సర్వీసెస్ ఎల్ఎల్పీ హానికర వ్యర్థాల ప్రీ-ప్రాసెసింగ్ కేంద్రాన్ని సందర్శించి, ప్రీ-ప్రాసెస్ చేసిన వ్యర్థాలను నిబంధనల ప్రకారం అనుమతించబడిన సిమెంట్ పరిశ్రమలకు తరలిస్తున్నారా లేదా అనే వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, నిబంధనల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రెండు పరిశ్రమలకు సంబంధించిన హానికర వ్యర్థాల నిర్వహణ వివరాలను ఏపీఈఎంసీఎల్ అంతర్జాల వేదికలో పరిశీలించడంతో పాటు, వ్యర్థాల రవాణా, కదలికలను పర్యవేక్షించేందుకు వినియోగిస్తున్న జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను కూడా తనిఖీ చేశారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిశ్రమల ప్రాంగణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని పోలంరెడ్డి దినేష్ రెడ్డి సూచించారు. ఈ పరిశీలనలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఈఈ సుధా కురుబ, ఏపీఈఎంసీఎల్ అధికారులు, సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి




**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-కడప నగరంలోని అమీన్ పీర్ దర్గా దగ్గర అమీన్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన భారీ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.టీడీపీ కడప నగర అధ్యక్షులు లయన్ పి.మన్సూర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు.30 సంవత్సరాల విశేష అనుభవం కలిగిన నిష్ణాతులైన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డా.మురళి. డా.రామ్మూర్తి నాయక్ చే ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..పేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి ఉచిత సేవా కార్యక్రమాలను చేపట్టడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.సాంప్రదాయ ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా దృక్పథంతో శిబిరాన్ని ఏర్పాటు చేసిన మన్సూర్ అలీ ఖాన్ ని,వైద్య బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు,వైద్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చీకటి గోపి లాకప్ డెత్‌పై న్యాయ విచారణ చేపట్టాలి

**● లాకప్ డెత్‌కు కారణమైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

**● గోపి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి:ఎమ్మార్పీఎస్ నాయకులు**



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన దళిత యువకుడు చీకటి గోపి (30) లాకప్ డెత్‌పై న్యాయ విచారణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రామకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బురుజుల పులికొండ డిమాండ్ చేశారు. లాకప్ డెత్‌కు కారణమైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆర్డీవో ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొంగతనం నెపంతో పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం వల్లే గోపి మృతి చెందాడని ఆరోపించారు. ఈ ఘటనను సాధారణ మరణంగా చిత్రీకరించడం సరికాదన్నారు. గోపి మృతికి కారణమైన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.గోపి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి మంజూరు చేయాలని కోరారు. దళితులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మహాదేవ్, జిల్లా కో-కన్వీనర్లు నరసింహులు, ఈశ్వర్, ప్రసాద్, ఉచ్చురప్ప, తిక్కయ్య, దేవనబండ లక్ష్మన్న, పత్తికొండ రాజు తదితరులు పాల్గొన్నారు.


## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

**● అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవంపై అవగాహన**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 23:**-మండలంలోని సిద్దవటం-6,సిద్దవటం-8 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ కడప అర్బన్ సీడీపీఓ ఎం. సుగుణ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప మాట్లాడుతూ పోషకాహారం ప్రాధాన్యత, ఆరోగ్య పరిరక్షణ, ఆహారంలో వైవిధ్యం తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. మరో సూపర్‌వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్లు అధికంగా ఉండే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరు సంవత్సరాలలోపు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## కేఓఆర్ఎం కాలేజ్ శిక్షణలో 13 మంది విద్యార్థులు ఎంపిక



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-కేఓఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శిక్షణ ఉద్యోగ నియామక విభాగం ఆధ్వర్యంలో ఎకో బ్రెయిన్స్ టెక్నాలజీస్ సంస్థ సహకారంతో ఉద్యోగ నియామక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకో బ్రెయిన్స్ టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ హేమంత్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంస్థ వివరాలు, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవసరమైన అవకాశాలు, ఉద్యోగ నియామక ప్రక్రియ గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్. లిఖితా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రోత్సహించారు. విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అంచనా వేసేందుకు వివిధ దశల్లో పరీక్షలు,ఇంటర్వ్యూలను నిర్వహించారు. అన్ని ఎంపిక దశలను విజయవంతంగా పూర్తి చేసిన 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రకళ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ప్రశంసించారు. శిక్షణ మరియు ఉద్యోగ నియామక విభాగం ఇన్‌చార్జ్ రెడ్డి మురళి కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని తమ సహకారాన్ని అందించారు.

## ముగిసిన ఉమ్మడి తూర్పు జిల్లా పరిషత్ పాలన

**● ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని జడ్పిటిసిల ఆవేదన**

**● పూర్తి వైసీపీ సమావేశంగా మారిన వైనం**





**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-గడిచిన ఐదేళ్ల జిల్లా పరిషత్ పాలనలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని జిల్లాకు చెందిన జడ్పిటిసి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు లేక ఎన్నో అభివృద్ధి పనులు ఆగిపోయాయంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశం పూర్తి వైసీపీ పార్టీ సమావేశంగా మారిపోయింది. మాజీ సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు.33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థలను బలోపేతం చేశారన్నారు . బుధవారం తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చివరి సాధారణ ఆత్మీయ, అభినందన సమావేశం అధ్యక్షుడు విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా విప్పర్తి వేణుగోపాలరావు ఐదేళ్ల పాలనా కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. 20212026 స్థానిక సంస్థల ఎన్నికల్లో పి గన్నవరం నియోజకవర్గం నుంచి జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన, అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు.కోవిడ్ లాంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ నిరంతరాయంగా పాలన సాగిస్తూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని జడ్పిటిసిలు కొనియాడారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేసి ప్రజా సేవకులుగా రాణించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేయాలని చెప్పిన సభ్యుల మాటలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు.ఏకగ్రీవంగా శ్మశాన మౌలిక వసతులు కల్పించారు.ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాలకు నిధులను సమానంగా కేటాయిస్తూ,రాజకీయాలకు అతీతంగా సుపరిపాలన అందించిన విప్పర్తి వేణుగోపాలరావుకు ప్రజలు,ప్రజాప్రతినిధులు,అధికారులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా పరిషత్ అధ్యక్షుడు వేణుగోపాలరావు దంపతులను సత్కరించారు.సమావేశంలో పాల్గొన్న జడ్పిటిసిలకు గ్రూప్ ఫోటో అందించి వారితో వారి కుటుంబ సభ్యులను సత్కరించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ బాబు,కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్వివి సత్య నారాయణ, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు బుర్ర అనుబాబు, మేరుగు పద్మలత, స్టాండింగ్ కమిటీ చైర్మన్ రొంగల పద్మావతి, సీఈవో వివివిఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి శ్రీ లలిత, జడ్పిటిసిలు పాల్గొన్నారు

## రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దుల్లో 22 వేల తాటి విత్తనాల నాటిన అటవీ శాఖ సిబ్బంది



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 23:**-కడప డీఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాల మేరకు, సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ ఇంచార్జ్ నయీమ్ అలీ సూచనలతో రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దుల వెంబడి అటవీ శాఖ సిబ్బంది తాటి విత్తనాలు నాటే కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రమైన సిద్ధవటం ఫారెస్ట్ బీట్ అవసర కోన సమీపంలో బుధవారం సిబ్బంది మాట్లాడుతూ.. మంగళ వారం నుండి సిద్ధవటం రేంజ్ పరిధిలోని సిద్ధవటం, గొల్లపల్లి, మద్దూరు,కొండూరు,ముత్తుకూరు బీట్లలో 22 వేల తాటి విత్తనాలు చల్లుతున్నామని తెలిపారు. తాటి చెట్లు జీవనశైలికి ఎంతగానో ఉపయోగపడతాయని, వన్యప్రాణులకు తాటి కాయలు ఆహారంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ శ్రీవిద్య



**సిద్దవటం మన జనప్రగతి సెప్టెంబరు 23:**- వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య సూచించారు. బుధవారం మండలంలోని మాధవరం-1 గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడారు. వర్షాల ప్రభావంతో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాజమండ్రిలో ముగిసిన పోషణ్ మాహ్ ప్రదర్శన



**రాజమండ్రి, మన జనప్రగతి సెప్టెంబర్ 23:**- కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్‌కాకినాడ ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ మాహ్ సందర్భంగా రాజమండ్రిలో నిర్వహించిన రెండ్రోజుల పోషకాహార ప్రదర్శన ముగిసింది.ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పోషకాహార స్టాళ్లను పరిశీలించి, ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది సేవలను అభినందించారు.విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీబీసీ అధికారులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

**- పాల్గొన్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ రావు**

**హైదరాబాద్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**- కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు అన్నవితరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవ, దాతృత్వం కేవలం ఒక చర్య మాత్రమే కాదని, సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిషన్‌గంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన నాయకులు హరి, సాయి, సంతోష్, నరేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కడపలో 25న జాబ్ మేళా

**• జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి ఏ. సురేష్ కుమార్**

**కడప,టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:**
నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి ఏ. సురేష్ కుమార్ తెలిపారు.కడప నగరంలోని ఓ. బ్లాక్ కలెక్టరేట్ సముదాయంలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. అపోలో ఫార్మసీస్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఇంటర్మీడియట్, డిప్లొమా, ఏదైనా డిగ్రీతో పాటు ఫార్మసీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు. చిల్లర ఔషధ విక్రయ రంగంలో 0 నుంచి 2 సంవత్సరాల అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వారి అనుభవం, పనితీరును బట్టి నెలకు గరిష్ఠంగా రూ.18 వేల వరకు వేతనం అందించడంతో పాటు ఉద్యోగ భద్రతకు సంబంధించిన వివిధ ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు.అర్హత, ఆసక్తి ఉన్న మహిళా, పురుష అభ్యర్థులు తమ తాజా దరఖాస్తు వివరాలు, విద్యార్హతల ధ్రువపత్రాల నకళ్లతో నిర్ణీత తేదీ, సమయానికి జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఇటువంటి ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నామని, అర్హతకు తగిన ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు హెచ్ఆర్ సురేంద్రను 9247570780 నంబర్‌లో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి తెలిపారు.

# ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ విస్తృత పర్యటన



**ధర్మవరం,మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** ధర్మవరం నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సెప్టెంబర్ 25, 26 తేదీల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రజారోగ్యం, సంక్షేమం, మౌలిక వసతులు, పర్యావరణ అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటలకు అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కిల్ వద్ద 72 నూతన 104 ఎంఎంయూ వాహనాలను ప్రారంభించనున్నారు. అనంతరం గర్ల్స్ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం ఎన్డీఏ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తారు.సెప్టెంబర్ 26న ఎల్.సి.కె పురం వద్ద సద్భావన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. పుట్టపర్తిలో పాత్రికేయుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం ధర్మవరం చెరువు సుందరీకరణపై ఇరాా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం కళాజ్యోతి శతవర్షోత్సవ వేడుకల్లో పాల్గొంటారు.ఈ పర్యటనలో ప్రజారోగ్యం, సంక్షేమం, పట్టణ అభివృద్ధి, ధర్మవరం చెరువు సుందరీకరణ తదితర అంశాలపై మంత్రి సమీక్షించనున్నారు.

# రాజమహేంద్రవరంలో సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.వెలగపూడి సచివాలయంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని టెంట్ సిటీలు, హోమ్‌స్టేలు, భక్తులకు అవసరమైన వసతులపై చర్చించారు.రాష్ట్రానికి ఇన్-బౌండ్ టూరిస్టులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్యాకేజీలు, ప్రచార కార్యక్రమాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ రోడ్‌షోలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.కేంద్ర పథకాల కింద మంజూరైన నిధులతో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని మంత్రి సమీక్షించారు. మరిన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పించి అదనపు నిధులు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చిన్నతనంలోనే కండరాల క్షీణత గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** చిన్నతనంలోనే కండరాల క్షీణత (మస్క్యులర్ డిస్ట్రోఫీ) లక్షణాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి అవసరమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.వెలగపూడి సచివాలయంలో అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 30న మంగళగిరిలో నిర్వహించనున్న 'సాహస్-2026' కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు ఈ కార్యక్రమంలో 130 ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు అండగా నిలుస్తూ శోభారాణి సుంకర చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వ్యాధి లక్షణాలను చిన్నతనంలోనే గుర్తిస్తే తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బాధితులకు సహాయం అందించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# కడప జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన కేఎఫ్‌డబ్ల్యు జర్మనీ బృందం



**పులివెందుల టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** కే ఎఫ్ డబ్ల్యు జర్మనీ పరిశోధన భాగస్వాముల బృందం బుధవారం వైఎస్సార్ కడప జిల్లాలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, రైతుల అనుభవాలు, ఆదాయ పరిస్థితులు, మార్కెట్ అనుసంధానం, పరిశోధన ఆధారిత వ్యవసాయ విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కే ఎఫ్ డబ్ల్యు ఆర్థికవేత్త శ్రీమతి ఐరిస్ హార్డర్, కే ఎఫ్ డబ్ల్యు న్యూఢిల్లీ సీనియర్ నిపుణురాలు సంగీత అగర్వాల్ పులివెందుల మండలంలోని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ అరటి క్షేత్రాలను సందర్శించి రసాయన, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. అనంతరం ఎర్రం రెడ్డిపల్లి గ్రామంలోని యూ.ఓ.ఆర్. ప్రాజెక్టు అరటి క్షేత్రాన్ని సందర్శించి అరటి కాండంతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, రైతులకు అదనపు ఆదాయ అవకాశాలపై చర్చించారు. పులివెందులలోని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఆఫ్ అగ్రోఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో పరిశోధనలు, వాటి ఫలితాలు, రైతులకు అందుతున్న ప్రయోజనాలపై చర్చించారు. పరిశోధన ఫలితాలను సంగీత అగర్వాల్ అభినందించారు. రైతులు, శాస్త్రవేత్తలు, రైతు మార్గదర్శకుల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ పర్యటనలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జి. మురళీధర్,శివకుమార్, సుధాకర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఉలవల విత్తనాల పంపిణీ ప్రారంభం



**ధర్మవరం, మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** ఇటీవల కురిసిన వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు సూచించారు.మంత్రి ఆదేశాల మేరకు బుధవారం ధర్మవరం మండలం పోతుకుంట రైతు సేవా కేంద్రంలో ఉలవల విత్తనాల పంపిణీని హరీష్ బాబు, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కాటమయ్య, గొట్లూరు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉలవల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఇటీవల మూడు, నాలుగు రోజుల్లో ధర్మవరం మండలంలో 44.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, భూమిలో ఏర్పడిన తేమ ఉలవల సాగుకు అనుకూలంగా ఉందని హరీష్ బాబు తెలిపారు. రైతులు భూములను ఖాళీగా ఉంచకుండా తేమను వినియోగించుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు.ఉలవల విత్తనాలు పొందేందుకు రైతులు ఆధార్, పాస్‌బుక్, మొబైల్ ఫోన్‌తో ఆర్ఎస్‌కేలకు వెళ్లి నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, సహకార సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వహించాలి: కమిషనర్ ఎం. జయకృష్ణ



**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల విధుల నిర్వహణపై నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ జయకృష్ణ అధ్యక్షతన ఆర్వో, ఏఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆర్వో, ఏఆర్వోల నియామకానికి ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైనదని తెలిపారు. ఆర్వో, ఏఆర్వోల పనితీరుపైనే ఎన్నికల విశ్వసనీయత ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు అందరికీ తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీనియర్ అధికారులు తమ కింద పనిచేసే సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం చేయాలని తెలిపారు. మొదటి విడతగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం వెబ్ సైట్ ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తాజా సూచనలతో అప్ డేట్ గా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, ఉప కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు, ఏసిపి మూర్తి మరియు వివిధ విభాగాల అధికారులు ఆర్వోలు పాల్గొన్నారు

# రాజమండ్రిలో పోషణ్ అభియాన్ ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం



**రాజమండ్రి మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** జాతీయ పోషణ్ మాసోత్సవాలు2026 సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), కాకినాడ క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల పోషణ్ అభియాన్ ఫోటో ఎగ్జిబిషన్‌ను రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించారు.రాజమండ్రి ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీబీసీ అధికారులు జి. సురేష్ కుమార్, రమేష్ చంద్ర, కందాళ శ్రీరామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ మహిళలు, శిశువుల సమగ్ర పోషణకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంపై రూపొందించిన 'సేవా సంకల్ప అభియాన్' ప్రచురణలను ఆమె ఆవిష్కరించారు.

# హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు



**మదనపల్లె,మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. స్మరణ్ రాజ్ తెలిపారు.మదనపల్లెలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద హెచ్ఐవీ/ఎయిడ్స్ అవగాహన కళాజాతాను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యువతకు హెచ్ఐవీపై అవగాహన కల్పించడంతో పాటు అధిక ప్రమాదం ఉన్నవారిని గుర్తించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.కళాజాతా బృందాల ద్వారా పట్టణాలు, గ్రామాల్లో హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలు, ఎస్‌టీఐ, క్షయ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపరాదని సూచించారు. ఈ నెల 29న విజయవాడలో రాష్ట్రస్థాయి 5కే మారథాన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అనంతరం స్మరణ్ రాజ్ మదనపల్లె జిల్లా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బందరులో గోవా షిప్‌యార్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం



**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డు కంపెనీ ఆధ్వర్యంలో భారీ రక్షణ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.8 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.మచిలీపట్నం పోర్టు పరిధిలో సుమారు 400 ఎకరాల్లో యుద్ధనౌకల తయారీ, మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్షంగా, 5,000 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్‌కు అవసరమైన ఆధునిక యుద్ధనౌకలను ఇక్కడ తయారు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర కేబినెట్‌కు మంత్రి కొల్లు రవీంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

# ఎర్రచందనం అక్రమ రవాణాపై పోలీసుల దాడులు.. ౯ మంది అరెస్ట్



**కడప,టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** వైఎస్ఆర్ కడప జిల్లాలో ఎర్రచందనం అక్రమ నరికివేత, రవాణాపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక దాడుల్లో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, సుమారు 1,810 కిలోల బరువున్న 87 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన ఐదు వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ తెలిపారు.మన్నూరు, వీరబల్లి, ఖాజీపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు. మన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 42 దుంగలు, 1,037 కిలోల బరువుతో పాటు కంటైనర్ లారీ, ఎక్స్‌ఎల్6 కారును స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరబల్లి పరిధిలో 8 దుంగలు, 179 కిలోల బరువుతో ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు.ఖాజీపేట పరిధిలో 37 ఎర్రచందనం దుంగలు, 574 కిలోల బరువుతో పాటు బొలెరో పికప్, సుజుకీ డిజైర్ కారును స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేశారు.ఈ దాడుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఎర్రచందనం నరికివేత, నిల్వ, కొనుగోలు, రవాణా లేదా అక్రమ కార్యకలాపాలకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పునరావృత నేరాలకు పాల్పడే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

## పాత్రికేయుల కోసం సెప్టెంబర్ 26న ఉచిత మెగా వైద్య శిబిరం




**ధర్మవరం, మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల కోసం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో సెప్టెంబర్ 26న పుట్టపర్తి సాయి ఆరామం హోటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో బెంగళూరులోని వైదేహి హాస్పిటల్, హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, తిరుపతి ఎస్వీఐఎంఎస్, అనంతపురం కిమ్స్ సవీరా ఆసుపత్రుల వైద్య బృందాలు సేవలు అందించనున్నాయి. శిబిరంలో కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ తదితర విభాగాల నిపుణుల సేవలతో పాటు ECG, 2D ఎకో, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా మహిళలకు పాప్‌స్మియర్, మామోగ్రఫీ, సోనో మామోగ్రఫీతో పాటు ఇతర పరీక్షలు అందుబాటులో ఉంటాయి. జిల్లాలోని పాత్రికేయులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం సూచించింది.

## సాగునీరు,తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 23:-**చిట్వేలి మండలంలో నెలకొన్న సాగునీరు,తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించి రైతులు, ప్రజలకు ఉపశమనం కల్పించాలని సీపీఐ మండల నాయకులు తిప్పన ప్రసాద్, సామా గంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు చిట్వేలి తహసీల్దార్ నరసింహారావు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పలు గ్రామాల్లో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీటి కొరత కారణంగా పంటలు సాగు చేసుకోలేక రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నీటి సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నిరంతర నీటి సరఫరా చేపట్టాలని,అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులకు అవసరమైన మరమ్మతులు చేపట్టి నీటి లభ్యతను మెరుగుపరచాలని అన్నారు. సాగునీటి విడుదల, నీటి లభ్యతపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. దేవి, నారాయణ పాల్గొన్నారు.

## బండి రమేష్‌కు రోజ్‌వుడ్ మహా గణపతి విగ్రహం బహూకరణ



**కూకట్‌పల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 23:-**వినాయక చవితి పర్వదినం సందర్భంగా కూకట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. పండుగ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌ను వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిలారు శ్రీనివాసబాబు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. బండి రమేష్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో కిలారు శ్రీనివాసబాబు ఘనంగా సత్కరించారు. అనంతరం వినాయక చవితి పర్వదినానికి గుర్తుగా మహా గణపతి రోజ్‌వుడ్ విగ్రహాన్ని బహూకరించారు. గణనాథుడి విగ్రహాన్ని అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు కూడా బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చావా శ్రీనివాస్, రామారావు, కొరారి వెంకట్, సురేష్‌మార్, మధుసూదన్, రావూరి శ్రీనివాస్, ఆదినారాయణ పాల్గొన్నారు.

# శభాష్ సాయి...

- బాల్ బ్యాడ్మింటన్ రాణిస్తున్నబీసీ విద్యార్థి సాయికుమార్
- మంత్రి సవిత అభినందనలు



**అమరావతి మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... ఏపీ నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవళ్ల సాయికుమార్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల విద్యార్థి, బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సాయికుమార్, కోచ్ జూనా నాయక్, ప్రిన్సిపాల్ వై.రమేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... జాతీయ పోటీలకు ఎంపికైనట్లు మంత్రి సవితకు సాయికుమార్ తెలిపాడు. వచ్చే నెల మూడో తేదీ నుంచి చత్తీస్ ఘడ్ లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొనబోతున్నట్లు వివరించాడు. బాల్ బ్యాడ్మింటన్ లో రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్ ను మంత్రి సవిత కొత్త దుస్తులు అందజేసి, అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించింది... రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో సాయికుమార్ కు మెళకువులు నేర్పిన కోచ్ జూనా నాయక్ ను, ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్ ను కూడా మంత్రి సవిత అభినందించారు.

## అన్నమయ్య జిల్లాలో రూ.94 కోట్ల హెచ్ఏఎం పనులకు ఆమోదం



**మదనపల్లె, మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** అన్నమయ్య జిల్లాలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.94 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నావీ) అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మదనపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఏఎం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లెకు రూ.27 కోట్లు, రాయచోటికి రూ.35 కోట్లు, బి.కొత్తకోటకు రూ.12 కోట్లు, పుంగనూరుకు రూ.20 కోట్ల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లెలో సీటీఎం రోడ్డు అభివృద్ధి పనులు తుది దశలో ఉన్నాయని, మరో పది రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అమృత్ 2.0 కింద రూ.35 కోట్ల పనులు కొనసాగుతున్నాయని, స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యర్థాల నిర్వహణకు రూ.5 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఖ×ణఖీ కింద తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగుదలకు రూ.56 కోట్ల ప్రతిపాదనలు అనుమతి దశలో ఉన్నాయని చెప్పారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పులివెందులలో వైసీపీకి భారీ షాక్

**- బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** రాబోయే మున్సిపల్ ఎన్నికల వేళ వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. స్థానిక పులివెందుల మున్సిపాలిటీలోని జెండామాను వీధికి చెందిన సుమారు 50 వైసీపీ కుటుంబాలు,పలువురు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పులివెందుల టీడీపీ నాయకుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జెండామాను చిన్నతో సహా ఈ కుటుంబాలు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలోకి వచ్చిన వారికి బీటెక్ రవితో పాటు ఇతర సీనియర్ నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో టీడీపీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణకు, నమ్మకానికి ఈ భారీ చేరికలే నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ పార్టీ పటిష్టతకు తమవంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టీడీపీ సీనియర్ నాయకులు మద్దూరు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ఉర్దూ & హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి,నల్లాగారి భాస్కర్ రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## ఏపీ ఎన్జీఓస్ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా నంద్యాల రాజశేఖర్



**కడప,మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** ఏపీ ఎన్జీఓస్ సంఘం వైఎస్ఆర్ కడప జిల్లా జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా నంద్యాల రాజశేఖర్ ఎన్నిక కావడంపై ఆంధ్రప్రదేశ్ నాన్-గ్రాడ్యుయేట్ వెటరినేరియన్స్ ఫెడరేషన్ వైఎస్ఆర్ కడప జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా నాయకత్వం మాట్లాడుతూ, నంద్యాల రాజశేఖర్‌పై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఏపీ ఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో సహకరించిన జిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్యలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల కార్యక్రమానికి అబ్జర్వర్లుగా హాజరైన అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్‌తో పాటు వైఎస్ఆర్ కడప జిల్లా కార్యవర్గ సభ్యులు, తాలూకా కార్యవర్గ సభ్యులు, జిల్లా, సిటీ మహిళా విభాగం ప్రతినిధులు, ఉద్యోగ సహోద్యోగులకు జిల్లా శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్యదర్శి సి. సదాశివయ్య, జిల్లా కోశాధికారి యం. విద్యాసాగర్ మాట్లాడుతూ, నంద్యాల రాజశేఖర్‌కు ఈ బాధ్యత దక్కడం ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించేందుకు మరింత అవకాశం లభించిందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. పశుసంవర్ధక శాఖ తరఫున రాజశేఖర్‌ను ప్రోత్సహించిన జిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వరదయ్య, బాబు నాయక్, మనీ, బాబా, సాయి కిషోర్, షాహిదా బేగం, సుజాత, లావణ్య, లక్ష్మి, వెంకటసుబ్బయ్య, రమేష్ కుమార్, శ్రీనివాసులు, నారాయణస్వామి, చంద్రమౌళి, మల్లికార్జున, మోహన్, సాయి, చాంద్ బాషా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ కళాశాలలో 25 నుంచి 27 వరకు 'యంత్ర 2K26'



**పులివెందుల, టౌన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** స్థానిక జేఎన్‌టీయూ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'యంత్ర 2K26 నేషనల్ లెవెల్ టెక్నికల్ సదస్సులు ను ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ వి. వెంకుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సాంకేతిక సదస్సుకు రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 400 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు పలు సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐఐఐటిడియం కర్నూలు సహకారంతో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా రంగాల్లో ప్రాథమిక పరిజ్ఞానంతో పాటు వాటి ప్రాయోగిక వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. అదేవిధంగా హైదరాబాద్ సహకారంతో రాయలసీమ ప్రాంతానికి చెందిన సుమారు 150 మంది రైతులకు డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, వాటి ప్రయోజనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యతపై రైతులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడమే 'యంత్ర 2ఖ26' ప్రధాన లక్ష్యమని ప్రొఫెసర్ వెంకుగోపాల్ రెడ్డి తెలిపారు.

## ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్‌కి పులివెందుల తాలూకా ఎన్జీవోస్ తరఫున కృతజ్ఞతలు



**విజయవాడ మన జనప్రగతి సెప్టెంబర్ 23:-** విజయవాడ ఏపీ ఎన్జీవోస్ భవనంలో రాష్ట్ర ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు మరియు జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ ని జనరల్ సెక్రెటరీ డి . వి రమణ ని ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ శ్రీకేఎస్ఎస్ ప్రసాద్ ని పులివెందుల తాలూకా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు మరియు విశ్రాంతి ఉద్యోగులు తాలూకా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు గజ్జల జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల తరఫున పెండింగ్ లో ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్స్ తదితర అంశాలపై ప్రభుత్వం నుండి ఉత్తర్వులు ఇప్పించగలరని మనవి చేయడం జరిగినది, ప్రత్యేకంగా గ్రామ సచివాలయాలు పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ల ప్రమోషన్ ఛానల్ మరియు జాబ్ చార్ట్ గురించి విద్యాసాగర్ దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగినది మరియు మెడికల్ నుండి హెల్త్ లో పనిచేసే కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల తరఫున వారికి రావాల్సిన నూరు శాతం గ్రాస్ శాలరీ మరియు రేగులైజేషన్ అంశాలపై వారి తరఫున విద్యాసాగర్ సారుకు విన్నవించడం జరిగినది వీటన్నిటికీ సానుకూలంగా విద్యాసాగర్ సారు స్పందించడం జరిగినది అలాగే దీనికి సమాధానంగా విద్యాసాగర్ మిగిలిన పెండింగ్ సమస్యలపై సాధ్యమైనంత త్వరలో పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం తరఫున పత్తె గంగయ్య ఇంకా సచివాలయ ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగులు పులివెందుల తాలూకా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు గజ్జల జగన్నాథ రెడ్డి నాయకత్వంలో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 23:-**చిట్వేది మండల కేంద్రంలోని సింగనమాల వీధికి చెందిన కుటుంబం ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటితో పాటు ఇంట్లోని సామగ్రిని కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న రాజుగుంట మాజీ సర్పంచ్ గుత్తి నరసింహ, మాజీ ఎంపిటిసి నానబాల నాగార్జున బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదం కారణంగా ఇంట్లోని వస్తువులు కాలిపోవడంతో కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని తెలుసుకుని వారికి అండగా నిలిచారు. ఇంటిని తిరిగి ఉపయోగించుకునేందుకు అవసరమైన ప్రతి వస్తువును సమకూర్చి అందించారు. అగ్ని ప్రమాదంతో తీవ్ర నష్టానికి గురైన కుటుంబానికి అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా తమ వంతు సహకారం అందించారు. ఆపద సమయంలో తమను పరామర్శించి, ఇంటికి అవసరమైన వస్తువులు అన్నింటినీ అందించిన గుత్తి నరసింహ, నానబాల నాగార్జునకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి అవసరమైన సహాయం అందించిన వారిని స్థానికులు అభినందించారు.

# రోడ్డు పక్కన నిల్చున్న 'కూలీలను ఢీకొట్టిన భారీ లారీ ట్రైలర్..'

**ఒక మహిళ మృతి..**

**మరో నలుగురికి తీవ్ర గాయాలు**

**బాధితులను పరామర్శించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి,మండల వైకాపా నాయకులు.**

**స్పీడ్ బ్రేకర్లకు సూచిక బోర్డులు ఏవీ..?ప్రమాదం తర్వాతే చర్యలా..?**







**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-వేముల మండల పరిధిలోని వేల్పుల గ్రామ సమీపంలో భూమయ్యగారిపల్లి క్రాస్ రోడ్డు ఆర్చ్ వద్ద బుధవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.కడపపులివెందుల ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన నిల్చున్న కూలీలను కడప నుంచి పులివెందుల వైపు వెళ్తున్న భారీ లారీ ట్రైలర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వేల్పుల గ్రామానికి చెందిన తుపాకుల లక్ష్మీనారాయణమ్మ (52) మృతి చెందగా,మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికుల వివరాల ప్రకారం...కూలీలు ఉదయం కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా వర్షం కురిసింది. దీంతో భూమయ్యగారిపల్లి క్రాస్ వద్ద రోడ్డు పక్కన నిల్చున్నారు.అదే సమయంలో MH 14 KQ 5748 నంబరు గల భారీ లారీ వేగంగా దూసుకొచ్చి వారిని ఢీకొట్టినట్లు తెలిపారు.ప్రమాదంలో లక్ష్మీనారాయణమ్మ మృతి చెందగా..క్షతగాత్రులను స్థానికులు వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో వేల్పుల గ్రామానికి చెందిన కొమ్మలపాటి రమణమ్మ (44), యాదవకుంట లక్ష్మీదేవి, పల్లెకొండు సుకన్య (32), పులివెందుల మండలం నలుగుండువారిపల్లెకు చెందిన బసినేని వెంకటరమణ (55) గాయపడ్డారు. ప్రమాదానికి లారీ అతివేగమే కారణమై ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.అయితే ప్రమాదానికి గల పూర్తి కారణాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. **బాధితులను పరామర్శించిన ఎంపీ..**ప్రమాద విషయం తెలుసుకున్న కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గాయపడిన బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, చికిత్సకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ భరోసా ఇచ్చారు. అనంతరం వేముల మండల వైకాపా నాయకులు, మండల వైసీపీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి, మండల వైకాపా పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము), వేల్పుల మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ తదితరులు బాధితులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. **స్పీడ్ బ్రేకర్ మార్కింగ్స్, సూచిక బోర్డులు ఏవీ..?**భూమయ్యగారిపల్లి క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఉన్నప్పటికీ వాహనదారులకు ముందుగానే కనిపించేలా హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్‌కు రేడియం మార్కింగ్ లేకపోవడంతో పాటు,స్పీడ్ బ్రేకర్‌కు కొంత దూరం ముందుగానే రోడ్డుపై వైట్ లైన్ మార్కింగ్, అలాగే స్పీడ్ బ్రేకర్‌పై మార్జిన్ వైట్ లైన్లు స్పష్టంగా కనిపించేలా వేయాలని స్థానికులు కోరుతున్నారు.వర్షం, రాత్రి సమయాల్లో స్పీడ్ బ్రేకర్ వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ముందస్తు హెచ్చరికలు, సూచిక బోర్డులు, వైట్ లైన్ మార్కింగ్‌లు ఉండటం అవసరమని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారిపై భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భద్రతా చర్యలు మరింత పటిష్టంగా ఉండాలని కోరుతున్నారు. **మరో ప్రమాదం జరిగినా అధికారులు మేల్కొనరా..?** ఇదే తరహాలో కొద్ది రోజుల క్రితం వేంపల్లి మండల పరిధిలోని తాళ్లపల్లె వద్ద కూడా స్పీడ్ బ్రేకర్ కారణంగా భారీ లారీ ట్రైలర్ ఘోర ప్రమాదం చోటుచేసుకుని అక్కడికక్కడే భార్యాభర్తలు ఇద్దరు కూడా మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తుచేస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ప్రమాదం జరగకముందే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.భూమయ్యగారిపల్లి క్రాస్ వద్ద వెంటనే స్పీడ్ బ్రేకర్‌కు ముందు వైట్ లైన్ మార్కింగ్, స్పీడ్ బ్రేకర్‌పై మార్జిన్ వైట్ లైన్లు, రేడియం మార్కింగ్, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే సంబంధిత అధికారుల బాధ్యత అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

# పెద్దరంగాపురంలో తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం

- **తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం**
- **మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23**:పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు పెద్దరంగాపురం గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు మున్సిపాలిటీ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తక్షణ చర్యలు చేపట్టారు.గ్రామంలో పర్యటించిన ఆయన స్థానికులతో నేరుగా మాట్లాడి,తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.సమస్య తీవ్రతను గుర్తించిన వెంటనే,పరిష్కార పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను,సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాశ్వత ప్రాతిపదికన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటా మని ఆయన హామీ ఇచ్చారు.క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని తక్షణమే స్పందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం గ్రామంలో ప్రారంభమైన తాగునీటి పనులను స్థానికులు,నాయకులు పరిశీలించారు.పులివెందుల పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి,పురుషోత్తం రెడ్డి,నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి,స్టోర్ అంకిరెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సచివాలయ,కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

**ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ హామీ**

**పులివెందుల తాలూకా ఎన్జీవోస్, ఉద్యోగుల ప్రతినిధి బృందం వినతి**

**నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ ఛానల్ ఉత్తర్వులపై సానుకూల స్పందన**



**విజయవాడ/పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:** గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులు,వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ సిబ్బంది పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి త్వరలోనే తగిన ఉత్తర్వులు వెలువడేలా చర్యలు తీసుకుంటామని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు,అమరావతి జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ హామీ ఇచ్చారు.విజయవాడలోని ఏపీ ఎన్జీవోస్ హోమ్‌లో అలపర్తి విద్యాసాగర్‌తో పాటు జనరల్ సెక్రెటరీ డి.వి.రమణ, ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కే.ఎస్.ఎస్.ప్రసాద్‌లను పులివెందుల తాలూకా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు గజ్జల జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ,విశ్రాంత ఉద్యోగుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై వినతిపత్రం అందజేశారు.గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లపై వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఛానల్ కల్పించడంతో పాటు స్పష్టమైన జాబ్ చార్ట్ కేటాయించాలని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించి,వారి సర్వీసులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు.ఈ అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ సానుకూలంగా స్పందిస్తూ,సమస్యల పరిష్కారానికి సంఘం తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర నాయకత్వానికి పులివెందుల తాలూ కా ఏపీ ఎన్జీవోస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు పత్తె గంగయ్య, పలువురు సచివాలయ ఉద్యోగులు,విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# హిందూముస్లిం ఐక్యతకు నిదర్శనం వినాయక చవితి వేడుకలు

**- పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 23:** మతాలు వేరైనా మనసులు ఒక్కటేనని చాటుతూ పులివెందులలో హిందూముస్లిం సోదరభావం వెల్లివిరిసింది. మున్సిపాలిటీ పరిధిలోని మారుతి హాల్ రోడ్డులో ఏకలవ్య అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పెనుకొండ తరుణ్ (అలియాస్ R15 చిన్న) నేతృత్వంలో హిందూముస్లిం సోదరులు కలిసి ఈ వేడుకలను నిర్వహించడం విశేషం.ఈ వేడుకలకు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి పండుగలు జరుపుకోవడం పులివెందుల సంస్కృతికి, మత సామరస్యానికి చక్కని నిదర్శనమని కొనియాడారు.పూజా కార్యక్రమాల అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమీ & హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా ఖాసీం,బీటెక్ రవి,అజ్జుగుట్టు రఘునాథరెడ్డి,కూటమి నాయకులు,కమిటీ సభ్యులు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య అసోసియేషన్ కమిటీ సభ్యులు,స్థానిక కూటమి నాయకులు,కార్యకర్తలు, ముస్లిం సోదరులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.రేపు జరగనున్న గణేష్ శోభాయాత్రను పులివెందుల ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

# వేంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించండి

**మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం**



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-మండలం లోని ఆయా గ్రామాలలో పంటలు సరిగా పండక కరువు తాండవం చేస్తుందని వేంపల్లి మండలాన్ని కరవు మండలం గా ప్రకటించాలని వేంపల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. స్థానిక వైయస్సార్ సభా భవనంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన మండల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుల కాలపరిమితి ముగిసే రోజు నిర్వహించిన ఈ సమావేశంలో ప్రధానంగా మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య ఇతరత్రా అంశాలపై సుదీర్ఘంగా చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యుడు రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో సరిగా వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయన్నారు. బోల్లగుంది చెరువు , నేలవరం తండా వాసుల తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ అవినాష్ రెడ్డి కోటా,మండల పరిషత్ గ్రాంట్ కింద రూ 10 లక్షలతో తాగునీటి బోర్లు ఏర్పాటు చేశామన్నారు. అయితే వర్షాలు సరిగా రాక భూగర్భ జలమట్టం అడుగంటి వారం రోజుల క్రితం ఆ తాగునీటి పథకం బోర్లు ఎండిపోయా యన్నారు.దీంతో అక్కడ తాగునీటి సమస్య మొదలైం దన్నారు . ఇలాంటి పరిస్థితి మండల వ్యాప్తంగా అన్నిచోట్ల ఉందన్నారు. ఈ కారణంగా వేంపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని పలువురు ఎంపీటీసీలు ప్రస్తావించగా తీర్మానం ఆమోదించి జిల్లా అధికారులకు నివేదికల పంపాలని జెడ్పిటిసి కోరారు. వేంపల్లి డిప్యూటీ ఎంపీపీ మెహతాజ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని వార్డులలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, చెత్త తరలింపు బండ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా చాలా వీధుల్లో వీధిలైట్లు కాలిపోయి రాత్రి వేళల్లో అంధకారం నెలకొందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె గ్రామ పంచాయతీ ఈవో కవితను కోరారు. ఎంపీటీసీ సభ్యులు కటిక చంద్రశేఖర్, భారతి తదితరులు మాట్లాడుతూ పాపాగ్ని నదిలో ఇష్టానుసారం ఇసుక తరలిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల నిబంధనల మేరకు ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. ఎంపీడీవో కులాయమ్మ, ఉప ఎంపీపీలు రమణమ్మ, మెహతాజ్, డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ జోయల్ వెస్లీ, ఎంపీటీసీ సభ్యులు ప్రదీప్ కుమార్ రెడ్డి, పద్మా జయలక్ష్మి దేవి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

# వినాయకుడి లడ్డూకు రూ.2.50 లక్షల ధర

**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 23:**-వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వేంపల్లె ముదిరాజ్ వీధిలోని వినాయక మండపం వద్ద బుధవారం నిర్వహించిన వేలంపాటలో వినాయక స్వామి లడ్డూకు రూ. 2.50 లక్షల ధర పలికింది.ముదిరాజ్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామివారి లడ్డూకు వేలంపాట నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలంపాటలో సిగా బయన్న కుమారులు సిగా శ్రీనివాసులు, సిగా రామాంజనేయులు కలిసి రూ. 2.50 లక్షలకు అత్యధిక ధరకు లడ్డూను దక్కించుకున్నారు. ముదిరాజ్ గణేష్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174